# పరీక్షలు

డాక్టర్, మీ చూపులో నామీద తృణీకార భావం కనబడుతోంది. సుఖరోగిని చూస్తే మీకు లోకువ. వొళ్లు మదమెక్కి, చపలుడై, కోరి తెచ్చుకున్న వ్యాధిలాగు కనబడుతుంది మీకు. యీ యేడు నా యూనివర్సిటీ పరీక్షల్లా డాక్టరు పరీక్షకింద తేలింది.

మొదటి ప్రశ్న:- నీకేం జబ్బు?

జవాబు :- మీకే తెలుసు

రెండో ప్రశ్న :- నీకెట్లా వొచ్చింది ?

జవాబు :- హోటలు భోజనం చాలక చిక్కిపోతున్నానని మీరే గదా నన్ను రాత్రుళ్లు పాలు త్రాగమన్నారు! ఆ సలహా వల్లనే, అసలు కలిగింది, యీ అంటువ్యాధికి కారణం. కనక దీంటో మీకు కూడా వుంది బాధ్యత. 'బిల్' పంపేటప్పుడా సంగతి జ్ఞాపకముంచుకోండి. మా సందు మధ్య చిన్న పాక. ఆ పాక వెనక దిబ్బ. ఆ దిబ్బమీద ఆవులు కట్టేసి వుంటాయి. ఆ దిబ్బమీద ఆ పాకలో అప్ప చెల్లెళ్ళిద్దరున్నారు. వాళ్ళ దగ్గిరే నేను పాలవాడిక పెట్టాను. అదుగో, ఏదో వుద్దేశంతో పెట్టాననుకుంటున్నారప్పుడే మీరు! ఏమీలేదు. చుట్టుపక్కల యిళ్ళ వాళ్ళందరూ వాళ్ళ దగ్గిరే పాలు పోయించుకుంటారు.

ఒక వారంరోజులయిం తరవాత నా గదికి వాళ్ళ రాకపోక లెక్కువైనాయి, ఒకామె ప్రొద్దున్నే పాలు తీసుకొచ్చేది. మళ్ళీ యింకా కావాలా అని రెండో ఆమె అడిగేది. తరవాత మొదటి ఆమె పాలచెంబు కోసం వొచ్చేది. రాత్రులూ యింతే........పాల చెంబుకోసం మొదటిఆమె వొచ్చి తీసికెళ్ళేటప్పటికి రాత్రి పదయ్యేది.

నాతో గదిలో వున్న సీతయ్య వేళాకోళాలు మొదలుపెట్టాడు, వాళ్ళనీ నన్నూ కలిపి నాకు కొంచెం సంతోషంగానే వుంది. వాళ్ల పెద్ద వాళ్ళయినా నన్ను యెవరో స్త్రీలు కోరి, నా చుట్టూ తిరుగుతున్నారంటే కొంచెం గర్వంగా వుండదూ? నాకేమిటి, మీకుండదూ ? నా గదికి వచ్చే స్నేహితులతో చెప్పి వాళ్ళతో కలసి హాస్యాలు చేశాడు తరవాత.

"పోనీ, పాపం, వాళ్ళంతగా పరితపిస్తోవుంటే నాదేం పోయింది?–" అనీ,

'కోరిన స్త్రీనిగాని, స్త్రీలనుగాని నిరాకరించడం మహా పాపమని ధర్మశాస్త్రాల్లో వుండ'దనీ,

'మేం కూడా పాలవాడిక అక్కడే పెడతా'మని యిట్లా నవ్వేవాళ్లు. పదిహేను రోజుల్లో సీతయ్య శలవలకి యింటికి వెళ్లాడు. నేను రెండోసంవత్సరం క్లాసులో వుండడంవల్ల, వుండిపోయినాను. ఆ మర్నాడు పెద్దామె మీ రక్షకుడు వూరికి వెళ్ళాడా?' అంది. తరవాత చూడండి, పాలకి వొచ్చి వాళ్ల కదలరు. 'స్టవ్' తమాషా చూస్తో కొంత సేపూ, ఆవులకి గడ్డీ దాణా ధర లెక్కువైన సంగతీ పొరుగువాళ్ళతో తగాదాల సంగతీ మాట్లాడ్డంతో కొంచెం సేపూ, వొచ్చి నప్పుడల్లా ఒక అరగంటన్నా వుండిపొయ్యేవారు. ఎవరన్నా చూసి యేమనుకుంటారో అని ఒకటే భయం నాకు. వాళ్ళిద్దరూ వయసు ముదిరినవాళ్ళే. ఒకామెకి నలభై, యింకో ఆమెకు కొంచెము తక్కువ వయస్సుంటుంది. ఇంత తెలివి తక్కువ వాడేమీ, కొంచెమైనా అర్థంకాదేమీ అని నవ్వుకుంటున్నారని తెలిసి, సిగ్గుపడి, రోషపడి, 'నాకు అర్థమైంది కాని, మీ వంటివాళ్ల నాకు

పనికిరారు నేను పోకిరి ననుకున్నారా? మా కుటుంబమర్యాద, శిష్టాచారం మా వూరు వస్తే మీకే తెలుస్తుంది!" అని వాళ్ళకి తెలియచెయ్యాలని వుండేది. ఒక్కొక్క రోజు మరీ వొంటరిగా వుండి, కొంచెం మతి జ్ఞానం కలిగినప్పుడు, పోనీ యింతలో పోయిందేమని ఉండేదిగాని, యెవరికన్నా తెలుస్తుందనే భయం నన్ను చూసేది. ఒక్కొక్కప్పుడు వాళ్ళమీదా, వాళ్లు పడే ప్రయాసమీదా జాలికలిగేది. నా కిటికీ దగ్గరనించి వెడుతో,తన బాధకీ, తన అక్క బాధకీ, గడ్డిధరలు హెచ్చడానికీ, మళ్ళీ గొడ్లు బందెలదొడ్డిలో పడడానికీ-అంతకీ నేనే కారణమైనట్లు వికారంతో చూసేది నా వంక ఆ చిన్నామె. దాంతో ఆ కొత్త అనుభవం యెట్లా వుంటుందో అనే విచిత్రపు కోర్కెతో వూటలూరేది నా మనసు.

ఆ రాత్రి 'మిల్టన్' పూర్తి చెయ్యాలనే నిశ్చయంతో 'టీ' తాగి కూచున్నాను. పగలంతా తీవ్రమైన ఎండకాసి, ప్రాణులమీద జాలి కలిగి నట్లు గాలి వీస్తోంది. దీపం వెలుతుర్ని మించిన వెన్నెల కిటికీలోంచి వెల్లు వలై పడుతోంది. తలుపుకొట్టిన చప్పుడయింది ఎవరో తెలుసు. కాని, 'యెవరూ?' అన్నాను.

'పాలచెం బియ్యండి' అంది, చిన్నామె. ఆమె వొచ్చి మాటలు పెట్టి 'డిస్టర్బు' చేస్తుందని, నేను కాంప్‌కాట్ మీదనించి లేచి, చెంబు తీసుకొని, యివ్వడానికి తలుపు తెరిచే సరికి, తోసుకుని లోపలికొచ్చింది, ఆమె.

"యేం చేస్తున్నారు?"

"చదువుకుంటున్నాను. యిదుగో చెంబు."

"అయ్యో! అంత తొందరేమండి....! పాలు బాగా వున్నాయా యివాళ!....

"ఆ"

"యే మెండకాసిందండీ? చచ్చిపోయినామనుకోండి మేము ! మీ కెట్లా వుందో కాని!.... మాకు మండుతోందండి...."

"లేదులే"

"అయ్యో మండుతోందండీ!........చూడు లోపలికి వెడుతోంది. నాకు గుండెలు కొట్టుకుంటున్నాయి. భయం వెంటే సంతోషమూ, ఆతృత ఎక్కువౌతున్నాయి. దీపం బాగా తగ్గించింది. ఆమె నన్ను వదలతలుచుకో లేదు. వెన్నెలతో గది నిండింది.

ఒక సంవత్సరంనించి యింటికి వెళ్ళలేదు, బ్రహ్మచారి జీవితం గడుపుతున్నాను. నెలరోజులనించి పుష్టి, అనుభవమూ కల యిద్దరు స్త్రీలు నా చుట్టూ తిరుగుతున్నారు. నా వివేకమంతా నశించి, యెందు కిల్లాంటి అవస్థ తెచ్చుకున్నావంటే, యింకేం చెప్పను?

"అబ్బా! యెంత వుక్కగావుంది ! యీ గది లోపల ఎట్లా పడు కుంటున్నారోగాని!"

కని పెడుతున్నట్టే వుంది, నా మనోసంచలనం— ఒక్క నెల ఓపిక పట్టింది, యింక తనే ప్రారంభించవలసిన అత్యవసరం కలిగింది- దగ్గిరకివాస్తో, మాట్లాడుతో దోవలోనే, తన మెడదగ్గిర గుండీ విప్పింది.

"పేలుడి కేమన్నా మందుందాండీ మీదగ్గర ? చూడండి యెట్లా పేలిందో?"

అని నా చేతికిరాని చూపించింది. దానితో భారద్వాజ, మైత్రేయ, వశిష్ట యిత్యాది రుషివంశ

* * * *

అయిదు నిమిషాల్లో తలుపుకొట్టారెవరో. ఎవరో వొచ్చారు, చూస్తారు, నా గతేమిటని, నా వొళ్ళు కంపరమెత్తింది. మా నాన్నా, మామ గారూ, ప్రిన్సిపాల్ ముగ్గురూ కలిసి నన్ను ప్రేమతో అర్థరాత్రి చూడ వొచ్చారని నిశ్చయమయింది. నాలిక అంగటికంటుకొని మాటరాలేదు ఆరుచేతులూ తలుపుకొడుతున్నాయి.

"ఇంకెవరు? ఆ ముండే!" అంది నా 'రూమ్‌మేట్'

'పాలచెంబండీ!' అంది పెద్దామె గొంతు.

మా అత్తగారూ, పోలీసు సూపరెండెంటూ, పై ముగ్గురూ కలిసి వస్తేనే నయమనుకున్నాను.

"నీ చెల్లెలు తీసికెళ్ళింది, వెళ్ళమనండి" అంది యీామె.

అన్నాను హీనస్వరంతో.

ఒక్క రవ్వసే వూరుకొని, "పొద్దున్నటి చెంబిక్కడే వుండాలండీ" అంది.

"లేదు"

"వుంది. చూస్తాగా, తలుపు తీద్దురూ"

వూరుకున్నాను. ఒక నిమషముండి,

"మా చెల్లెలుందండీ, లోపల?" అని అరిచింది.

హడిలిపోయినాను. చుట్టూవున్న యిళ్ళలో తలుపులు, కిటికీలు తీసుకుని, స్త్రీలు పురుషులు అనేక వందలమంది వింటున్నట్టుంది. ఇంక వదలదు. తొరగా వెళ్ళి తలుపు తీశాను. పెద్దామె లోపలికి వచ్చి వెంటనే గ్రహించి 'అమ్మ దొంగా!' అని నన్ను పట్టుకుంది. ఆ రాత్రి ముగ్గురమూ ఆ సన్నని కాంప్ కాట్‌మీద యిరికాము........

తరవాత మూడురోజులు యేమైనానో, యేం చేస్తున్నానో, యెక్కడున్నానో చెప్పలేను— యిద్దరూ ఒకసారే వచ్చేవారు, ఒకసారే వెళ్ళేవారు. ఒకరి తరవాత ఒకరు రాకూడదా అని సూచించాను. చిన్నప్పటినించి కూడా వాళ్ళిద్దరికీ శరీరాలు వేరన్నమాటేగాని ఆత్మలూ కంచాలూ శాలువలూ అన్నీ ఏకమేననిన్నీ, ఒకర్ని విడిచి వేరుగా, వేరేకాలమందు యింకోరు అనుభవించమనిన్నీ చెప్పారు. ఒకరోజు మధ్యాహ్నం పెద్దామె దోవలో కనపడి,

"దాంతో యెక్కువ సావాసం చెయ్యకండి, తంటా" అంది.

"యేం?"

"దాన్ని వుంచుకున్నవాడికి అనుమానంగా వున్నట్టుంది, కనుక్కున్నాడంటే...."

"నేనేం రమ్మన్నానా నీ చెల్లెల్ని?"

"తాగి, వొళ్ళుతెలీక, కఱ్ఱతీసుకొని వీధంతా కేకలేస్తో వొచ్చినప్పుడు, వాడితో అనండి, ఆమాట! నాతో యెందుకు?"

ఆ సాయంత్రమే, చిన్నామె కిటికీదగ్గిరికి వొచ్చి తొందరగా "మా అక్కయ్యతో జాగర్తండోయ్! అట్టే రానీకండి?"

"ఏం?"

"ఇట్టానే మనుషుల్ని మరిగించి, నమ్మించి తటాలున వొదిలేసిపోతుంది – తరవాత మీ అవస్థ యేం చెప్పను? అనేకమంది వురేసుకున్నారు-నామాట వినండి!"

ఈమె కోసమేనా అనేకమంది వురేసుకుంది! వాళ్ళు ఎలాంటివాళ్ళో! కాని నన్ను మరిగించి యేడిపించే అపాయం ఏమీలేదు.

ఈ యిద్దరి మాటలూ ఒక్కసారిగా, అక్కకి చెల్లెలితోనూ, చెల్లెల్ది అక్కతోనూ చెప్పేశాను. ఇంక నాగదిలో వాళ్ళు సలిపిన యుద్ధం యెట్లా చెప్పను! మహాప్రభో, వర్ణనాతీతం. మళ్ళీ తిక్కన్న అవతారమెత్తవలసిందే. అరవడానికి వీలులేదు. బుగ్గలు నొక్కుకోడాలూ, పాములాగ బుస్సులు కొట్టడాలూ రహస్యాలు చెప్పుకుంటున్నట్టు చెవుల్లో తిట్లూ, నన్ను సాక్ష్యాలూ, నన్ను గొప్ప, గొప్ప పేర్లతో ఒకర్ని మించివొకరు పొగడడం, నన్ను కావిలించుకోవడం, ఒకర్నొకరు రక్కడం, నామీద వొట్లేసుకోవడం, నా బుగ్గలు ప్రేమతో లాగడం కొంతసేపు జరిగిందారు. రెవికలు చింపుకొని, జుట్లు పీక్కుని అలిసి యిద్దరు చప్పుడులేకుండా

నామీదపడ్డారు. భీమకీచక సంగ్రామాన్ని వర్ణించిన నలుగురు పురాతన నవీన కవులు సమితిగా కూడి పద్యాలు వ్రాసినా న్యాయం జరగదు ఆ దృశ్యానికి.

ఐదో రోజున బాధ మొదలుపెట్టింది నాకు. నాకోపంలో రోషంలో అసహ్యంలో యిద్దర్నీ తన్నాను. ఇట్లాంటి రోగాలుంటాయని, వాటి దింత యమకం అని నా కంతవరకూ తెలీదు. పుణ్యాత్ములు చెప్పరు. బూతులు తిడతారు గాని యీ విషయం మాట్లాడడం తప్పు.

"నేను చెప్పలా, మీతో! మొదటే చెప్పలా! యీమాట అనలేక, యీ సంగతి చెప్పలేకే ఆ వొంకపెట్టి యీ సంబంధం వొద్దంటే విన్నారూ?"

రెండోఆమా అంతే అన్నది.

"నాకా! నాకా! దానికేనండీ! మీమీద ఎంత వొట్టుపెడితె అంత వొట్టు....పోస్టు జవాన్ సాయేబు లేదండీ........"

రెండోదీ యిదే ధోరణి.

* * * *

గది వొదిలిపెట్టి పారిపోయి వొచ్చి, మీ శరణు చొచ్చాను.

★